ప్రజాశక్తి
గురువారం 16 జనవరి 2025
5
అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

18న మెగా రక్తదాన శిబిరం

విజయవంతం చేయండి : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్థంతి సందర్భంగా ఈ నెల 18వ తేదీ పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణ మంటపంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరం నిర్వహణపై బుధవారం కాలవ పట్టణంలోని తన నివాసంలో పట్టణ టిడిపి నాయకులు, వార్డు ఇన్‌ఛార్జులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు సతీమణి నారా భువ నేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అవసరమైన వారికి, ఆపదలో ఉన్నవారికి విశేష వైద్య సేవలు అందిస్తోందన్నారు. తలసేమియా బాధితులు, అత్యవసరం, ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తూ ప్రాణాలు నిలబెడుతుందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా ఎన్టీఆర్ వర్థంతి రోజు న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30వేల యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించాలని నిర్ణయించారన్నారు. అందులో భాగంగా పట్టణంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిబిరం నిర్వహిస్తామని దాతల నుంచి 500 యూనిట్ల రక్తం సేకరిం చాలని సూచించారు. అందులో 400 యూనిట్లు ఎన్టీఆర్ ట్రస్ట్‌కు, వంద యూనిట్లు బళ్లారిలోని ప్రభుత్వ వైద్యశాలకు అందిస్తామన్నారు. రాయదుర్గం ప్రాంత వాసులు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం ఎక్కువగా బళ్లారికి వెళ్తున్నందున బళ్లారి ఆసుపత్రికి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో దాతలు విరివిగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

మరో వాహన పరిశ్రమ..!

- ఆజాద్ ఇండియా మొబిలిటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు
- రూ.1046 కోట్లతో పరిశ్రమ స్థాపన





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాకు మరో వాహన తయారీ పరిశ్రమ రానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఇది వరకే ఒప్పందం కుదిరింది. ఈ సంస్థ ఏర్పాటుకు అవసరమైన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలో ఇప్పటికే 'కియా' కార్ల తయారీ పరిశ్రమ ఉన్న విషయం తెలిసిందే. దాని సమీపంలోనే మరో వాహన తయారీ పరిశ్రమ రానుంది. ఎలక్ట్రికల్ త్రీ వీలర్, ట్రక్కులు, బస్సులు తయారీ పరిశ్రమ గుడిపల్లి వద్ద ఏర్పాటు కానుంది.

ఆజాద్ ఇండియా మొబిలిటీ సంస్థ ఏర్పాటు

సత్యసాయి జిల్లాలోని గుడిపల్లి సమీపంలో రూ.1046 కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఆజాద్ ఇండియా మొబిలిటీ అనే సంస్థ ఇక్కడ ఎలక్ట్రికల్ ఆటోలు, ట్రక్కులు, బస్సులు తయారీ చేయనుంది. మూడు దశల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఏప్రిల్ 2026 నాటికి మొదటి దశ, ఏప్రిల్ 2028 నాటికి రెండవ దశ, 2030 నాటికి మూడవ దశ పూర్తవనుంది. రూ.1046 కోట్లతోచేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా 2231 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ చెబుతోంది.

గుడిపల్లి వద్ద 70.71 ఎకరాలు కేటాయింపు

గుడిపల్లి సమీపంలోనున్న ఎపిఐఐసి లేఅవుట్‌లో 70.71 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూముల కేటాయింపు కూడా దశల వారీగానే కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి దశకు 36 ఎకరాలు, రెండో దశకు 26 ఎకరాలు, మూడవ దశకు 8.71 ఎకరాలు ఇలా మూడు విడతల్లో భూ కేటాయింపులు జరపాలని ఎపిఐఐసికి ఆదేశాలిచ్చింది. దీంతో సత్యసాయి జిల్లాలో ఇప్పుడున్న కియాతోపాటు అదనంగా మరో వాహన పరిశ్రమ రానుంది. ఇదే కాకుండా మరో అతిపెద్ద పరిశ్రమ ఒకటి వచ్చే అవకాశముందని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ అనంతపురం జిల్లాకు విచ్చేసిన సందర్భంలో ప్రకటించారు. ఆ పరిశ్రమ ఏదన్న దానిపై ఇంకా పూర్తి స్థాయి స్పష్టత లేదు. త్వరలో వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇవి కార్యరూపం దాలిస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కొంత వరకు మెరుగుపడే అవకాశాలున్నాయి.

ఎమ్మెల్యే అమిలినేని చొరవ...

ఎస్సీ హాస్టల్‌లో వసతులు మెరుగు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులతో పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ఎమ్మెల్యే గతంలో హాస్టల్‌ను తనిఖీ చేసిన సమయంలో కొన్ని సమస్యలను గుర్తించారు. అలాగే హాస్టల్ సిబ్బంది, విద్యార్థినుల కోరిక మేరకు స్పందించిన ఎమ్మెల్యే హాస్టల్‌కు ప్రధాన గేట్ సిద్ధం చేయించారు. వాటర్ ప్యూరిఫయర్ మిషన్ బిగించి ఫిల్టర్ నీరు అందించారు. నూతనంగా టాయిలెట్స్ గతులు నిర్మిస్తున్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. వైరింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

క్యూరింగ్ చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం - వేసిన పది రోజులకే నెర్రెలు..



సరిగా క్యూరింగ్ చేయని సీసీ రోడ్డు



నెర్రెలు చీలిన సీసీ రోడ్డు

ప్రజాశక్తి-కుందుర్పి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో మండల కేంద్రమైన కుందుర్పిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2.07 కోట్లు మంజూరయ్యాయి. సీసీ రోడ్ల నిర్మాణ పనులను పార్టీ కోసం కష్టపడిన టిడిపి నాయకులకే కట్టబెట్టారు. అయితే కొందరు నాయకులు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీ రోడ్లు వేసిన తర్వాత కాంట్రాక్టర్లు సరిగా క్యూరింగ్ చేయకపోవడం వల్ల న్యూ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నెర్రెలు చీలిందని కాలనీ వసూలు పెదవి విరుస్తున్నారు. నీళ్ల అందుబాటు లేకపోవడంతో సీసీ రోడ్లను క్యూరింగ్ చేయడంలో కాంట్రాక్టర్లు పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణ బలంగా వినపడుతున్నాయి. రోడ్డు వేసి పట్టుమని పది రోజులైనా కాకుండానే చీలికలు రావడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, మామూళ్ల మత్తులో జోగుతుండడం వల్లే కాంట్రాక్టర్లు ఏమాత్రం నాణ్యత పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్లు నాసిరకంగా వేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, రోడ్లు నాణ్యతగా నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎంపీని కలిసిన దివ్యాంగుల కమిటీ సభ్యులు



ఎంపి అంబికతో దివ్యాంగులు కమిటీ సభ్యులు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, అనంత దివ్యాంగుల సేవా సమితి ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పామిడిలో ఎంపీ నిధులు రూ.7లక్షలతో కొత్తగా నిర్మించిన విశాల ఫ్రెరర్ దివ్యాంగుల కమిటీ భవనాన్ని ఈ నెల 21న ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని దివ్యాంగులు ఎంపీని కోరారు. భవన నిర్మాణానికి 10 సెంట్ల స్థలం ఇచ్చి సహకరించిన పామిడి తహశీల్దార్ సునీతాబాయికి కతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హరనాథ్ రెడ్డి, పామిడి మండల అధ్యక్షుడు కేశవాచారి, ఉపాధ్యక్షుడు నాగభూషణం, సెక్రటరీ సర్వేస్ పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి పోటీల్లో పాల్గొన్న అనంత నగర కాలనీవాసులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలను పరస్కరించుకుని ఆట, పాటలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. మల్లు స్వరాజ్యం కాలనీ, గణేనాయక్ కాలనీ, మహదేవ్ నగర్‌లో చిన్న పిల్లలకు మ్యూజికల్ ఛైర్స్, లైమన్‌అండ్ స్పూన్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. మహిళలకు మ్యూజికల్ ఛైర్, టగ్ ఆఫ్ వార్, ముగ్గులు పోటీలు, పురుషులకు బరువు ఎత్తడం, శాక్‌రేస్, పౌరాణిక పద్యాలు, డ్యాన్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చంద్రిక, అశ్విని, వహీదా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల రంగయ్య, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, నగర నాయకులు వెంకట, డేవిడ్, రాము, వన్నూర్, శంషాద్, హాజీవలి, షరీఫ్, కుమార్, రాఘవ, హరి పాల్గొన్నారు.

గుంతకల్లు : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని సిఐటియు కాలనీ, తిలక్ నగర్ ప్రాంతాల్లో రెండు రోజులుగా ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బి.శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడా పోటీలు యువతకు మానసిక ఉత్సాహం ఇస్తాయన్నారు. కావున యువతీ, యువకులు విద్యతో పాటు క్రీడలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య ధోరణిలో యువతీ, యువకులు మద్యం, డ్రగ్స్, సెల్‌ఫోన్‌కు బానిసవు తున్నారని, వాటి వల్ల మానసిక, శరీర దృఢత్వం కోల్పోతూ చెడు వ్యసనాలు బారినపడి సమాజానికి ప్రమాదకరంగా మారుతున్నారన్నారు. కావున యువతీ, యువకులు ఆటల పోటీల్లో పాల్గొని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి మారుతిప్రసాద్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, కెవిపిఎస్ నాయకులు రాము నాయక్, పట్టణ కమిటీ నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్లా, సూరి, షాషా, జాకీర్, జ్యోతి, లక్ష్మీబాయి, సుగుణ, ఖాదర్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు అబ్దుల్లా, షణ్ముఖ, మున్నా, సుదీప్, విక్రమ్, ఉష, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సిపిఎం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై దాడి కేసులో విఆర్‌కు కానిస్టేబుల్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో వన్‌టౌన్ కానిస్టేబుల్ నారాయణస్వామి గొడవపడి దాడి చేసిన ఫిర్యాదుపై ఎస్పీ పి.జగదీష్ స్పందించారు. దీనిపై ప్రాథమికంగా విచారించిన అనంతరం సదరు కానిస్టేబుల్‌ను విఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని అనంతపురం డీఎస్పీని ఆదేశించారు. విచారణానంతరం తదుపరి చర్యలుంటాయని ఎస్పీ స్పష్టం చేశారు.

వెండి కిరీటం వితరణ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలో నూతనంగా వెలసిన చౌడమ్మ విగ్రహానికి తాడిపత్రి వాస్తవ్యులు శంకర్ లావణ్య దంపతులు వెండి కిరీటం వితరణ చేశారు. ఆలయ అర్చకులకు బుధవారం కిరిటాన్ని అందించారు. యల్లనూరు మండలంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్ 350 గ్రాముల వెండితో అమ్మవారికి కిరీటం చేయించారు.

18, 19న పెద్దమ్మ తల్లి జాతర

యల్లనూరు : మండల కేంద్రం పెద్దమ్మ తల్లి అమ్మవారి జాతర ఈ నెల 18,19వ తేదీల్లో నిర్వహించేందుకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. జాతరలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేస్తున్నారు. జాతర ఉత్సవం విజయవంతం అయ్యేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

17న ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో గల పేద ప్రజల కోసం ఈనెల 17న ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్పందన ఆసుపత్రి అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలోని సాయి నగర్ లో (బాబా గుడి వద్ద) స్పందన హాస్పిటల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రూ.3.40 కోట్లతో సిసి రోడ్లు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బుక్కరాయసముద్రం మండలంలో రూ.3.40కోట్లతో గ్రామాలకు సిసి రోడ్లు వేయిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావశణి శ్రీ తెలియజేశారు. మండల పరిధిలోని రేకులకుంట గ్రామంలో రూ.5 లక్షలు, బొమ్మలాటపల్లిలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంతల రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పంచాయితీ నిధులను పూర్తిగా దుర్వినియోగం చేసి గ్రామాలు అభివద్ధి చెందకుండా చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఐదు నెలల కాలంలోనే వేల కోట్ల రూపాయలు వ్యయం చేసి సిసి రోడ్లను వేయిస్తున్నట్లు తెలియజేశారు. బుక్కరాయసముద్రం మండలంలో 3.40 కోట్ల రూపాయలు వెచ్చించి సిసి రోడ్లు వేయిస్తున్నట్లు చెప్పారు. బుక్కరాయసముద్రం మండలంలో 39 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని తిలకించారు. అందులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు శిలా ఫలకం ప్రారంభం

మండల పరిధిలోని వడియంపేట, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.26 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సారథ్యంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పూర్తయిన సీసీ రోడ్ల శిలా ఫలకాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, ఎంపీడీవో సల్మాన్ రాజ్, మండలం ఇంజినీర్ మద్దిలేటి, జిల్లా సీనియర్ టీడీపీ నాయకులు పసపల శ్రీరామి రెడ్డి, పొడరాళ్ల రవీంద్ర, దయ్యాలకుంటపల్లి మాజీ సర్పంచి పెద్దప్ప, వడియంపేట సర్పంచి నాగార్జున, ఆదినారాయణ, బికెస్ మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, కేశన్న, ఓబుళపతి, మాజీ సర్పంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సంక్రాంతి పండగ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని శిల్పారామంలో మూడు రోజులపాటు నిర్వహించిన సంబరాలు అలరించాయి. మంగళవారం భోగి సందర్భంగా టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ సహకారంతో శిల్పారామం ఏవో రమేష్ రెడ్డి సిబ్బంది మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా పులివెందుల రాజా డాన్స్ అకాడమీ వారి స్థానిక బిల్డర్లు ప్రదీప్, రమేష్ సహకారంతో డాన్స్‌లతోపాటు జబర్దస్త్ ఫేమ్ రియాజ్, రాజమౌళి కామెడీ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారి చైత్ర పౌర్ణమి సినిమాలోని భరతనాట్యమున అనే పాటకు తల మీద దీపం, రెండు చేతులలో సంక్రాంతి దీపాలు పెట్టుకొని చేసిన నృత్యం ఆకట్టుకుంది. చిన్నారులు పెద్దలు చేసిన గ్రూప్ డాన్సులు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు స్థానిక టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్లు బెస్త చలపతి, పిసి గంగన్న, మైనార్టీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, మాజీ ఎంపీటీసీ శ్రీరామ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చెన్నకేశవులు తదితరులు బహుమతులు అందజేశారు. బుధవారం కనుమ సందర్భంగా ధర్మవరం నాట్య అకాడమీ అధర్వంలో నిర్వహించిన నృత్యాలు అలరించాయి. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాలు కొనసాగాయి.

విషపు నీరు తాగి మూగ జీవాలు మృత్యువాత

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఓ రైతు తన వ్యవసాయ పొలంలో పంటకు పిచికారి చేసిన మందు కలిపిన నీరు తాగి మేకలు, గొర్రెలు, ఆవులు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని నంజాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వాటి కాపరులు, పశు వైద్యాధికారి నవీన్ కుమార్ తెలిపిన వివరాలు.. కాపరులు తమ పశువులు, మేకలు, గొర్రెలను మేత మేసిన తర్వాత మధ్యాహ్న సమయంలో ఇంటికి తీసుకెళ్లే క్రమంలో ఓ రైతు వ్యవసాయ తోటలోని చిన్న తొట్టిలో నీరు తాపారు. అయితే అందులో రైతు పంటకు పిచికారి చేసే సమయంలో యూరియా కలిపి ఉండడంతో ఈ విషయం తెలియక కాపరులు జీవాలను నీరు తాగేందుకు తీసుకెళ్లారు. విషపూరితమైన తొట్టిలోని నీరు తాగడంతో 7 మేకలు, 19 గొర్రెలు, 3 ఆవులు మృత్యువాత పడ్డాయి. విషయం తెలిసిన వెంటనే గోపాల మిత్ర గోవిందు, హరి సంఘటన స్థలానికి చేరుకొని పశువైద్యాధికారి నవీన్‌కుమార్ సలహా మేరకు మిగిలిన జీవాలకు చికిత్స అందించారు. నంజాపురం గ్రామానికి చెందిన పాడి రైతు కంచప్పకు చెందిన గొర్రెలు, ఆవులు, ఎర్రకొండాపురం గ్రామానికి చెందిన పాడి రైతు బోయ జయన్నకు చెందిన గొర్రెలు మృతి చెందాయి. దీంతో సుమారు రూ. 5 నుంచి రూ. 8 లక్షల వరకూ వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని పాడి రైతులు కోరారు.



మృతి చెందిన మేకలు, గొర్రెలు, ఆవులు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి-డి.హీరేహాల్



ఎరుకల గణేష్(ఫైల్‌ఫోటో)

ఇంటికి రంగులు వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని సోమలాపురం గ్రామంలో చోటుచేసుకుంది. మండల కేంద్రమైన డి.హీరే హాల్‌లోని ఎరుకల వీధిలో నివాసం ఉంటున్న ఎరుకల గణేష్(22), అంజి, తిప్పేస్వామి సోమలాపురం గ్రామంలో ఓ ఇంటికి రంగులు వేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణేష్ ఇంటి వెలుపల రంగులు వేస్తుండగా ఇంటి విద్యుత్ సర్వీస్ లైన్‌కు ఉన్న వైర్లు తగిలాయి. దీంతో గణేష్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శెట్టూరు మండలంలోని కైరేవు గ్రామ శివారులో ఎక్సైజ్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేసి కర్నా టక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ సునీల్‌కుమార్ తెలిపారు. కైరేవు గ్రామానికి చెందిన హనుమంతరాయుడు, గంగాధర్ అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకుని ఒక్కొక్కరి నుంచి 96 టెట్రా ప్యాకెట్లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో డిటిఎఫ్ జయనాథ్‌రెడ్డి, సరిహద్దు ఎస్ఐ రాజేంద్రప్రసాద్, పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగలకు దేహశుద్ధి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని ముప్పాలకుంట గ్రామ సమీపంలో చోరీకి పాల్పడిన ఇద్దరు అనుమానితులను పట్టుకుని గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. వివరాలు.. ముప్పాలకుంట గ్రామ శివారులో ఉన్న ఓ వ్యవసాయ తోట వద్ద మంగళవారం ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వారిని పట్టుకుని విచారించగా గొందిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహేష్, వన్నురుస్వామిగా గుర్తించారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులో తీసుకున్నారు. యువత తాగుడుకు బానిసై చోరీలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

రేకుల షెడ్డులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని బైరసముద్రం గ్రామానికి చెందిన చాకలి రంగస్వామి సిమెంట్ రేకులు షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుని వస్తువులు కాలి బూడిదయ్యాయి. వివరాలు.. మంగళవారం అర్ధరాత్రి ఉన్నఫళంగా సిమెంట్ రేకుల షెడ్డుకు నిప్పు అంటుకొంది. దీంతో ఇంట్లోని పలు వస్తువులు కాలిపోయాయి. ఆవుదూడకు గాయాలయ్యాయి. ఈ షెడ్డు పక్కనే ఆనుకొని ఉన్న బోయ తిప్పేస్వామి ఇంటి గోడ కాస్త చీలింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ. లక్ష ఆస్తి నష్టం నష్టం వాటిల్లినట్లు బాధితుడు రంగస్వామి వాపోయాడు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా లేదా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారా అనే విషయాలు తెలియాల్సి ఉంది.

పేకాట జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని ఎ.తిమ్మాపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 42,200 స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, ఇతర జూదం ఆడితే ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య

కొత్తచెరువు : స్థానిక కొండకింద కాలనీకి చెందిన వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన మేరకు వివరాల మేరకు కాలనీకి చెందిన బోయ శివ (30) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవడు. ఈయనది సొంత ఊరు అనంతపురం అక్కడనుండి వలస వచ్చి మూడు నెలల కిందట ఈ కాలనీలో ఇల్లు తీసుకొని కుటుంబంతో సహా నివాసం ఉన్నాడు. బుధవారం శివ భార్య గార్మెంట్స్ కు వెళ్లడంతో. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శివ మద్యానికి బానిస అయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేకనే శివ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతునికి భార్య, కొడుకు కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ ఇందిర తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి.. పలువురికి గాయాలు

రొద్దం : మండలంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన సంజీవప్ప(55) బైక్‌పై వెళ్తూ పెనుకొండ ప్లేట్ల వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సంజీవప్పను బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్.మరువపల్లి గ్రామానికి చెందిన వంశీ, చాంద్‌బాషా బైక్‌పై వెళ్తూ గ్రామ సమీపంలో అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మార్గంలో కేబుల్ నెట్‌వర్క్ పనుల కోసం తీసిన గుంతలు, మట్టి వల్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు ప్రజలు మండిపడుతున్నారు.

అనంత సాగరంలో ఘర్షణ

బత్తలపల్లి : పాతకక్షలను మనసులో పెట్టుకొని ఇరువర్గాల మధ్య మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఏడుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన చెరుకూరి ఈశ్వరమ్మ, చెరుకూరి ఈశ్వరయ్య వర్గాల మధ్య గతంలో బంగారు గొలుసు విషయమై ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈశ్వరయ్య మేనల్లుడు ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఇరు వర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో ఈశ్వరమ్మ, హేమంత్, రామాంజనేయులు, ఈశ్వరయ్య, ప్రవీణ్, గవ్వల, శివయ్య, గవ్వల ఈశ్వరమ్మ గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు

తిరుమల ఆర్టీసీ డిపోను సందర్శించిన జోనల్ ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్



రికార్డులు పరిశీలిస్తున్న పూల నాగరాజు

ఎపిఎస్ ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు బుధవారం తిరుమల డిపోను సందర్శించారు. అనంతరం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తిరుపతి, డిపిటిఒ నరసింహులు, తిరుమల డిపో మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌కు సన్మానం

డి.హీరేహాల్ : నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మంజునాథగౌడ్ రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైె విషయం తెలిసిందే. దీంతో బుధవారం కురుబ సామాజిక వర్గానికి చెందిన కేశవతో పాటు పలువురు మంజునాథగౌడ్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కురుబ సామాజిక వర్గాన్ని గుర్తించి రాష్ట్రస్థాయిలో బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కట్టబెట్టడం హర్షణీయమన్నారు.

19న కడవకల్లులో పెద్దమ్మ జాతర

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామంలో ఆదివారం పెద్దమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించిన తర్వాత ఆది వారం ఉదయం బోనాలు సమర్పిస్తారన్నారు. ఆ తర్వాత దేవర కార్యక్రమం ప్రారంభమవుతుందని గ్రామస్తులు తెలిపారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజనేయులు సూచించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు సూచనల మేరకు 133వ బూత్ కన్వీనర్ మీనుగ పెద్దన్న సహకారంతో అంబేద్కర్ నగర్, పాత ఎస్సీ కాలనీ, మూగ బసవన్నకట్ట ప్రాంతాల్లోని యువతకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో అంబేద్కర్ నగర్ నుంచి 2 టీంలు, పాత ఎస్సీ కాలనీ, మూగ బసవన్న కట్ట ఏరియాల నుంచి 2 టీంలు పాల్గొన్నాయి. విన్నర్స్ ప్రభ(వెంకీ)టీంకు 11,111, రన్నర్స్ నరసింహ టీంకు రూ.5,555 నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. క్రికెట్ టోర్నమెంటును గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు కట్టుబడి ఖలందర్, వార్డు మెంబర్లు పాటిల్ నిరంజన్‌గౌడ్, రామాంజనేయులు, నిర్వాహకులు మీనుగ రవి, జియో అనిల్ కుమార్, ఖాజా, మేజర్ గ్రామపంచాయతీ మేస్త్రీలు లేపాక్షి, రామాంజనేయులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు అండగా బీఎస్పీ : చిందనూరు

ప్రజాశక్తి-రాయదుర్గం



మాయావతి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

భారత రాజ్యాంగాన్ని పార్టీ మేనిఫెస్టోగా ప్రకటించిన ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని ఆ పార్టీ ఎపి లాయర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నారాయణస్వామి తెలిపారు. బిఎస్‌పి జాతీయ అధ్యక్షులు మాయావతి జన్మదినం సందర్భంగా బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు కేక్ కట్ చేశారు. నాగరాజు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన ఏకైక జాతీయ పార్టీ బీఎస్పీ అన్నారు. పార్టీని బలోపేతం చేయ డంతో పాటు స్థానిక సమస్యలపై పోరాటం చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మైనింగ్ అక్రమ కార్యకలాపాలను ఆపామన్నారు. ఉడేగోళం గ్రామంలో దళితుల శ్మశానవాటిక, రాయదుర్గంలో గొల్లపల్లి రోడ్డు వద్ద బెస్తల శ్మశానవాటిక స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా కాపాడినట్లు తెలిపారు. ప్రజలు వారి సమస్యలను బీఎస్పీ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కషి చేస్తామన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ తాలూకా కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి ఉలిగప్ప, పాల్గొన్నారు.

కంచిరెడ్డి సోదరుల ఆర్థికసాయం

ప్రజాశక్తి-శింగనమల



మహబూబ్‌బాషాకు ఆర్థికసాయం అందజేస్తున్న కంచిరెడ్డి సోదరులు

మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన బంగారం మహబూబ్‌బాషా కుమార్తె వివాహానికి బుధవారం కంచిరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 10వేలు అందజేసినట్లు వైసిపి మండల నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మహబూబ్ బాషా ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న వారు అతడి కుమార్తె వివాహ ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కంచిరెడ్డి కృష్ణారెడ్డి, కంచిరెడ్డి కోటీశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యావేత్తకు సర్వేపల్లి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం



సర్వేపల్లి అవార్డు అందుకుంటున్న గొర్తి వెంకటస్వామి

ప్రముఖ విద్యావేత్త, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు గొర్తి వెంకటస్వామికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు లభించింది. దీంతో తిరుపతి నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కవి, జర్నలిస్ట్, ప్రజాకళావేదిక ఛైర్మన్ అరవ జయపాల్ అధ్యక్షతన ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ రచయిత్రి, శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రోజారమణి అవార్డు గొర్తి వెంకటస్వామికి అవార్డు అందజేశారు. అతిథులుగా ప్రముఖ సామాజిక కార్యకర్త, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ప్రముఖ కవి, సినీ గీత రచయిత సురేంద్ర పాల్గొన్నారు. మూడు దశాబ్దాలుగా విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న గొర్తి వెంకటస్వామిని వారు శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. గొర్తి వెంకటస్వామి విడపనకల్లు మండలంలోని పాల్తూరు మెయిన్ స్కూల్ హెచ్‌ఎంగా అందించిన సేవలను ప్రశంసించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా, శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ సలహాదారుగా ఆయన పని చేస్తున్నారు. ఎస్‌కెయు నుంచి ఎం.ఎ.(ఎకనామిక్స్), ఎం.ఫిల్., పట్టా పొందారు. నంద్యాలలో బి.ఎడ్., పూర్తి చేసి 1996 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యారు. తొలి పోస్టింగ్‌లోనే యాడికి మండల ఉత్తమ టీచర్‌గా రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ నుంచి అవార్డు పొందారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని 2022 సెప్టెంబర్‌లో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ నుంచి అందుకున్నారు. ఎన్టీఆర్ శతజయంత్యుత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీవెంకట పద్మావతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం లభించింది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ ఎం.నరసింహ యాదవ్, తదితరులు 2023 మే 9వ తేదీ తిరుపతి యూత్ హాస్టల్‌లో ఘనంగా సత్కరించారు. విద్యారంగంతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా, సామాజిక సేవా రంగాల్లో వెంకటస్వామి తన వంతు పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లల సమగ్రాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్య సంరక్షణ కోసం విశేష కృషి సాగిస్తున్నారని గుర్తు చేశారు. గొర్తి వెంకటస్వామికి డా. సర్వేపల్లి జాతీయ అవార్డు రావడం పట్ల పలువురు కవులు, టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

బసినేపల్లితండా ఉపసర్పంచి మృతి

ప్రజాశక్తి-గుత్తి



సీతమ్మ(ఫైల్‌ఫోటో)

మండలంలోని బసినేపల్లితండా ఉప సర్పంచి, వైసిపి నాయకురాలు ముడావత్ సీతమ్మ(54) బుధవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు ముడావత్ శ్రీరాములునాయక్ భార్య ముడావత్ సీతమ్మ కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురవడంతో కర్నూలులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచి సుశీలమ్మ, వైసిపి ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లాలునాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న సి. వెంకటేశ్వర్లురెడ్డి

సమిష్టిగా ఆడితే విజయం ఖాయం

ప్రజాశక్తి-గుత్తి

క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఐక్యతతో ఆడితే విజయం సాధిస్తారని ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో మంగళవారం నిర్వహించిన ఫుట్‌బాల్ శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు మెలకువలు నేర్చుకొని ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటాలన్నారు. కలిసి మెలిసి ఆడితేనే టోర్నీల్లో విజయం సాధిస్తారన్నారు. అనంతరం టిడిపి నాయకుడు ఆర్‌బి.కమలాకర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఆర్‌బి.సాయిశశిభార్గవ్ క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ కెసి.కుళ్లాయప్ప, టిడిపి నాయకుడు బోర్‌వెల్ నాగరాజు, చికెన్ మస్తాన్, ఫుట్ బాల్ కోచ్‌లు ప్రసాద్, దాదు, మహేష్, సునీల్, జి.శ్రీనివాసులు, లోకా, శీన, ఆనంద్, విజయ్ పాల్గొన్నారు.



విద్యార్థిని అమృతకు ఆర్థికసాయం అందజేస్తున్న ఇన్ఫినిటీ ఛారిటబుల్ సభ్యులు

విద్యార్థిని చదువుకు బద్దేనాయక్ చేయూత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఓ నిరుపేద విద్యార్థిని చదువు కోసం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ చేయూతనందించారు. కంబదూరు మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన అమృత పుత్తూరులోని ఓ ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి పాతన్న రోజువారి కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ పరిస్థితుల్లో ఆమె కళాశాల ఫీజు కట్టలేక 3 నెలల నుంచి గ్రామంలోనే ఉండిపోయింది. ఆ గ్రామ యువకుల సలహాతో విద్యార్థిని తండ్రి పాతన్న బద్దేనాయక్‌ను సంప్రదించాడు. దీంతో బుధవారం ట్రస్ట్ ఆఫీస్‌లో సభ్యుల సమక్షంలో రూ. 30వేలను కళాశాల యాజమాన్యానికి చేరేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సురేష్‌కుమార్, కార్యదర్శి హరీష్, సభ్యులు సాయినాథ్ తిప్పేస్వామి, ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, ఆది, ఆంధ్ర తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.



కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న కురుబలు

అట్టహాసంగా కనకదాసు జయంతి

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని తూముకుంట గ్రామంలో బుధవారం భక్త కనకదాసు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కురుబ సంఘం మండల అధ్యక్షులు రమేష్, మాజీ అధ్యక్షులు కెపి.గోపాల్ హాజరై మాట్లాడారు. కురుబల ఆరాధ్య దైవం కనుకదాసు జయంతిని ఏటా నిర్వహించడం గర్వించబదగ్గ విషయమన్నారు. అంతకుముందు మహిళలు నెత్తిన పూర్ణకుంభాలు పెట్టుకుని గ్రామంలోని ప్రధాన రహదారి గుండా ఊరిగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి రామాంజ నేయులు, తెనగల్లు సర్పంచి వరలక్ష్మి వెంకటేశులు, బికె.లక్ష్మణమూర్తి, బికె.గంగాధర, బికె.హనుమంత రాయుడు, గంగాధర, బసప్ప, మల్లప్ప, రామంజి, దేవరాజు, కురుబ కులస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా ఆచరించారు. ప్రధానంగా పెద్దవడుగూరులోని చెన్నకేశవస్వామి, పేటశివాలయం, సుంకులమ్మ, చౌడేశ్వరి, గంగమ్మ, క్రిష్టిపాడులోని చౌడేశ్వరి, కోటకొండ ఆంజనేయస్వామి, మల్లేనిపల్లి సంజీవరాయుడు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వెంకటాంపల్లిలో ప్రజలు భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ జాతరను చేపట్టారు.

బాటసుంకులమ్మ ఆలయంలో టెంకాయల విక్రయానికి వేలం

ప్రజాశక్తి-గుత్తి



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి-44 పక్కన వెలసిన బాటసుంకులమ్మ ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి నిర్వహించిన వేలం పాట రూ. 36.60 లక్షలు పలికింది. 2025 సంక్రాంతి నుంచి 2026 సంక్రాంతి పండుగ వరకూ ఏడాది పాటు ఆలయ ఆవరణలో టెంకాయలు విక్రయించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో రూ. 500 చెల్లించి 12 మంది పాల్గొన్నారు. పోటా పోటీగా జరిగిన వేలం పాటలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పుల్లయ్య రూ. 36.60 లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాది వేలం పాట దావరా రూ. 28 లక్షలు వచ్చింది. వేలం జరుగుతున్న సమయంలో ఆలయం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కర్లకుంట రమేష్ నాయుడు, అంబటి నరసింహులు, వెంకటరాముడు పాల్గొన్నారు.



పుట్లూరు జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పుట్లూరు

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదో తరగతి పూర్తయిన వారు దాదాపు 20 ఏళ్ల తర్వాత అందరూ ఒకేసారి ఇలా కలవడంతో భావోద్వేగాలకు లోనయ్యారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంగా సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత బొమ్మనహాల్ జట్టు

ప్రజాశక్తి-బొమ్మనహాల్



ట్రోఫీతో బొమ్మనహాల్ జట్టు

సంక్రాంతి సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో యువ నాయకులు పయ్యావుల అనిల్, నవీన్ ఆధ్వర్యంలో కబడ్డీ ఆటలు పోటీలు నిర్వహించారు. మొత్తం 15 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో విడపనకల్లు మండలంలోని పాల్తూరు జట్టు, బొమ్మనహాల్ జట్టు తలపడ్డాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బొమ్మనహాల్ జట్టు గెలిచింది. విజేత జట్టుకు జనసేనపార్టీ రాయదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంజునాథ్‌గౌడ్, విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ బహుమతులు ప్రదానం చేశారు. మంజునాథ్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచి వన్నమ్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో 12 ఏళ్ల తర్వాత ఈ నెల 18, 19 తేదీల్లో జిల్లా స్థాయి ఇస్తేమా జరుగుతోంది. ఈ క్రమంలో క్రాసింగ్ సమీపంలో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ముస్లింలు తరలివస్తారని, వారు ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంతంగా ప్రార్థనలు చేసుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ట్రాక్టర్లు, ప్రొక్లయినర్లు, హిటాచీలతో స్థలం చదును చేయడంతో పాటు రాళ్లు, ముళ్లపొదలు తొలగిస్తున్నారు. నీటి సౌకర్యం కోసం సమీప ప్రాంతాల నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇస్తేమా విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ముస్లిం పెద్దలు కోరారు. ఇస్తేమా ప్రదేశంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ ముస్లిం మత పెద్దలు ఎస్ఐ సాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇస్తేమా శనివారం ఉదయం మొదలై ఆదివారం రాత్రి దువాతో ముగుస్తుంది.

వాలీబాల్ టోర్నీ విజేత ఉరవకొండ జట్టు

ప్రజాశక్తి-ఉరవకొండ

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని ఆమిద్యాల ప్రభుత్వ పాఠశాలలో జనతా అగ్రి సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో ఉరవకొండ జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంటులో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. పోటీలు 2 రోజుల పాటు కొనసాగాయి. మంగళవారం ఉరవకొండ, విడపనకల్లు జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. చివరకు 15-13, 15-13 తేడాతో ఉరవకొండ జట్టు విజయం సాధించింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు మాజీ జడ్పిటిసి గుర్రం సుధాకర్, టిడిపి నాయకులు శ్రీధర్ బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవలన్నారు. యువత క్రీడలతో పాటు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మహారాజరాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జిగారి కోర్టులో, అనంతపురము.
C.M.A.No.09/2024
Between :
ఎం.లక్ష్మి ... అప్పిలెంట్/పిటిషనర్
మరియు
డి.రామాంజినేయులు ...రెస్పాండెంట్
రెస్పాండెంట్ కి నోటీసు
డి.రామాంజినేయులు, తండ్రి వెంకటనాయుడు, నివాసం: ఇంటి నెం. 12/3/21, సాయినగర్, అనంతపురము పట్టణం మరియు జిల్లా.
ఇందుమూలముగా రెస్పాండెంట్కి తెలియ జేయడమేమనగా, పై అప్పిలెంట్/పిటిషనర్ మీపై పైన తెలిపిన అప్పీలును పై కోర్టులో దాఖలు చేసినారు. పై కేసులో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిననూ చేరనందున, పై కేసును మీ హాజరు నిమిత్తం 29-01-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.
//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//
జి.రామమూర్తి,
అప్పెలెంట్ పరం న్యాయవాది,
29-01-2025 అనంతపురము.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE : ANANTHAPURAMU
O.S.No.136/2024
Between:
C.Anil Kumar ...Plaintiff
And
P.David Ondsimos ...Defendant
Notice to Defendant
To.
P.David Ondsimos, S/o.P.Jayandam, D.No.11-1-188, IIIrd Cross, Aravinda Nagar, Ananthapuramu.
పై నంబరు దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పైకోర్టు వారు 20-01-2025వ తేది నాటికి వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పైకేసు మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
J.Chittaranjan,
Jagadeesh,
Advocates, Ananthapuramu
Cell:9440222366.

IN THE COURT OF THE HON'BLE FIRST ADDITIONAL CIVIL JUDGE AND J.M.F.C., AT BALLARI
O.S. NO. 502 / 2021
BETWEEN:
Sri. Hemanna ...Plaintiff
-And-
Sri. Edigara Rangappa and others ...Defendants
SUMMONS
To
Defendant No.3 and 5:
D3) Smt. Mamatha W/o. Thippeswamy, D/o. Sathyappa, aged about 28 years, R/ o. Hulikeri @ Pulicherla Village, Kanekal Mandalam, Rayadurga Taluq, Ananthapur District, Andhra Pradesh.
D5) Gavi Prasad S/o. Sathyappa, aged about 24 years, R/o. Hulikeri @ Pulicherla Village, Kanekal Mandalam, Rayadurga Taluq, Ananthapur District, Andhra Pradesh.
WHEREAS, the above named plaintiff has filed the above case against you and others seeking partition and separate possession in respect of the suit properties. You are hereby directed to appear before this Hon'ble court in person or by pleader duly instructed and able to answer all the material questions relating to the case or who shall be accompanied some person able to answer all the such questions, on the day 21-02-2025 at 11:00 "0" clock in the forenoon to answer the claim and failing which the matter will be heard and determined in your absence as ex-parte. Given under my hand and seal of the Court on this 13-01day of 2025.
(By order of the Court)
(Sri Thippeswamy.K) Advocate for the Plaintiff
Shirestedar First Addl. Civil Judge and J. M . F. C., Ballari